క్లుప్తంగా

సీఎం కార్యక్రమ సైడ్‌లైట్స్



⇨ సాయంత్రం 6:30 గంటలకు నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన జనజాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు.

⇨ 6:48 గంటలకు బహిరంగసభా వేదికపైకి చేరుకొని ప్రజలకు అభివాదం చేశారు.

⇨ 7గంటలకు మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోథల పథకాన్ని మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి చేనేత శాలువాతో సన్మానించారు.

⇨ 7:41 అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ప్రసంగించారు.

⇨ 7:56 సీఎం ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

⇨ 8:30 సీఎం ప్రసంగం ముగింపు.

⇨ 8:32 గొల్ల కురుమ యాదవులు సీఎంకు గొర్రెను అందజేసి, గొంగడి కప్పి సన్మానం.

⇨ 8:45 గంటలకు ప్రత్యేక వాహనాలు, పోలీసు బలగాల మధ్య హైదరాబాద్‌కు బయలుదేరిన సీఎం.

సభకు తరలిన నాయకులు



మరికల్: జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు.

కరపత్రాలు విడుదల



ధన్వాడ: మరికల్ మండలంలోని చిత్తనూరు ఇథనాల్ కంపెనీ మూసివేయాలని డిమాండ్ చేస్తూ 18న హైదరాబాద్ నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సరోజన, రామచంద్రయ్య, మోహనకృష్ణ, తింగప్ప, హనుమంతు, మద్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాగనూర్: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని తెలిపారు. అధికారులు శాఖల వారీగా నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

మద్దూరు: మండల సర్వసభ్య సమావేశంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయరాములు సోమవారం ప్రకటనలో తెలిపారు. మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, హాజరుకావాలని సూచించారు. అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

'మోసం తట్టుకోలేకే పార్టీ మార్పు'

ఆత్మకూర్: మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ మోసపూరిత రాజకీయాలతోనే తాను పార్టీని వీడానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా తాను పోటీ చేయగా.. బీఆర్ఎస్ అభ్యర్థి డీకే అరుణ సోదరుడు చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి లోపాయికారిగా సహకారం అందించారని దుయ్యబట్టారు. అన్ని సర్వేల్లో తానే గెలుస్తున్నానని తెలిసి తన తమ్ముడి కోసం పార్టీ సిద్ధాంతాలను తుంగలో తొక్కి ద్రోహం చేయడంతోనే తాను ఓటమి చెందానని వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకుంటామని, డీకే అరుణ ఓటమే ధ్యేయంగా, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు.

సామగ్రి దగ్ధం

భూత్పూర్: మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులో రైతు నిర్లక్ష్యంతో రూ.లక్ష విలువ గల విద్యుత్, వ్యవసాయ సంబంధ పరికరాలు కాలి బూడిదైనట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. జానంపేటకు చెందిన రైతు రాంకుమార్ పొలం వద్ద ఉన్న మొదళ్లు నిప్పు పెట్టి వెళ్లిపోయారు. దీంతో గడ్డి అంటుకుంటూ మంటలకు పక్క పొలాలకు వ్యాపించాయి. గమనించిన రైతులు జానంపేట గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే జానంపేటకు చెందిన ఆంజనేయులు, పోల్కంపల్లికి చెందిన వెంకటయ్యకు చెందిన మూడు కరెంట్ స్టార్టర్ బాక్స్‌లు, సర్వీస్ వైర్లు, స్ప్రింక్లర్ పైపులు కాలి బూడిదయ్యాయి.

అద్దెభవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- ప్రభుత్వ పాఠశాల గదుల్లో నిర్వహణ
- సరైన వసతులు కరువు



ఊట్కూర్‌లో కమ్యూనిటీ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

ఊట్కూర్: ప్రభుత్వం శిశు, మహిళ సంక్షేమానికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన పక్కా భవనాలు ఏర్పాటు చేయకపోవడం చిన్నారులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిశు మరణాలను తగ్గించాలని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో సొంత భవనాలు 10, ప్రభుత్వ పాఠశాలల అదనపు గదులు, కమ్యూనిటీ భవనాలలో 33, అద్దె ఇళ్లలో 25 కేంద్రాలు కొనసాగుతున్నాయి. కేంద్రాలకు పూర్తి స్థాయిలో పక్కా భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని అదనపు గదులు, కమ్యూనిటీహాల్, అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. గ్రామాల్లో అద్దెకు భవనాలు దొరకపోవడంతో చిన్న గదుల్లో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నెలకు రూ. వెయ్యి అద్దె చెల్లిస్తుంది. గదుల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై సమావేశాలు, ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ, ఇతర కార్యక్రమాలను నిర్వహించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అద్దె గదుల్లో గాలి, వెలుతురు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలం లేకపోవడంతో ఆట వస్తువులు నిరుపయోగంగా ఉంటున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు ఆట, పాటల ద్వారా చదువు చెప్పేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో ఇలా..

పులిమామిడిలో పాఠశాలలోని ఒకే తరగతి గదిలో 4 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఊట్కూర్‌లో పాఠశాలలోని ఒకే తరగతి గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అమీన్‌పూర్ పాఠశాల అదనపు గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుంది. పగిడిమారిలో పాఠశాలలో ఒకే అదనపు గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. బిజ్వార్‌లో పాత పంచాయతీ భవనంలో కొనసాగుతుంది. అవుసలోనిపల్లిలో మూడు కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం



మండలంలో 68 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. పది సొంత భవనాలు ఉన్నాయి. మిగతా కేంద్రాలు పాఠశాల అదనపు గదులలో, కమ్యూనిటీ భవనాలలో, అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. గతంలో పక్కా భవనాలకై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం ద్వారా ఆదేశాలు వస్తే భవనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. –గీతా, సూపర్‌వైజర్, ఊట్కూర్.

మున్సిపల్ కమిషనర్‌తో కౌన్సిలర్ వాగ్వాదం



మున్సిపల్ కమిషనర్‌తో తాగునీటి సరఫరాపై మాట్లాడుతున్న కౌన్సిలర్ విజయ రాములు

అమరచింత: పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా.. సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ముడో వార్డు కౌన్సిలర్ విజయరాములు మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీంను నిలదీశాడు. మూడో వార్డులో మిషన్ భగీరథ నీటితో పాటు బోరు మోటార్ల ద్వారా నీటి సరఫరా అందటంలేదని మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణానికి ఆరు ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటు సోర్సు బోర్ల ద్వారా నిరంతరం తాగునీటిని అందిస్తున్నామని సమాధానం ఇచ్చారు. దీంతో కౌన్సిలర్ విజయరాములు మాట్లాడుతూ.. కొళాయి నీరు వస్తే ట్యాంకర్ల ద్వారా నీటిని ఎందుకు వార్డులకు పంపుతున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. దీంతో ఇరువురు మధ్య మాటమాట పెరిగి వాదోపవాదాలకు దారితీసింది.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



కోస్గిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: కేంద్రంలో మూడో సారి బీజేపీ అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించబోతుందని నాగురావునామాజి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని 22వ వార్డుల్లో ఆయన పర్యటించి పాలమూర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిపాలనపై నిప్పులు చెరిగారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రమీల, హన్మంత్‌రావు, క్యాతన్‌రఘునాథ్, బాలాజీ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కోస్గి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీకి మద్దతునిచ్చి బీజేపీ అభ్యర్థి డీకే అరుణను ఎంపీగా గెలిపించాలని సోమవారం కడంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వెంకటేష్, రాము, శ్రీకాంత్, శ్రీనివాస్, బుగ్గప్ప పలువురు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ



కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలకు సోమవారం శిక్షణ ఫౌండేషన్ హైదరాబాద్ వారు 40 లీటర్ల వాటర్ ఫిల్టర్‌ను అందించారు. ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఆమని మాట్లడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఫిల్టర్‌ను అందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎఫ్ఎల్ఎన్ భ్యాసన కరదీపికలో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని పగిడిమారిలో సోమవారం బీరప్ప బండారు ఉత్సవాలను నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి బండారు చల్లుకున్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బీజేపీ ఎంపి అభ్యర్థి డీకే అరుణ ఉత్సవాలలో పాల్గొని పూజలు చేపట్టారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కోస్గి: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. మేరకు సోమవారం ఎంపీపీ మధుకర్ రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పలువురు ఎంపీటీసీలు సభలో తెలుపగా పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సాయి లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మరికల్: మండల కేంద్రానికి ఎంపీటీసీ సభ్యుడు గోపాల్‌తో పాటు 20 మంది బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మరింత కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో హరీష్, గోవర్దన్, రామకృష్ణ, రఘు, రాములు, జమ్మన్న, మొగులన్న, మోహన్, కతలప్ప, శ్రీను, రాజు, బాలప్ప, కుర్మన్న పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

మాగనూర్: దళిత యువకులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని అంబేడ్కర్ సంఘం మక్తల్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. సోమవారం గాయపడిన వారిని పరామర్శించి, ఉప తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాగనూర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అంబేడ్కర్ జయంతి సందర్భంగా బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన జెండాను గ్రామానికి చెందిన కొంతమంది అల్లరిమూకలు కలిసి తొలగిస్తుండగా అంబేడ్కర్ యువ సంఘం సభ్యులు అలా తొలగించడం తప్పని చెప్పడంతో వారిపై తీవ్రంగా దాడి చేశారన్నారు. ఈ దాడిలో యువజన సంఘం సభ్యులు ఆరుగురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్యక్రమంలో పోలప్ప, రమేష్, సురేష్, రాఘవేంద్ర, ఆనంద్, మహేష్, బైని నర్సింహ, స్వప్నిల్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు వెంటనే చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

మద్దూరు: ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న కూలిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పెదిరిపాడ్ చెరువులో ఉపాధి పనుల చేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఇప్పటి వరకు 8 వారాలు గడుస్తున్న కూలీలకు డబ్బులు చెల్లించలేదన్నారు. అలాగే పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, మహ్మద్ అలీ, రామాంజనేయులు, అంజప్ప, వెంకటప్ప, గోవిందు, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



బోనాల ఊరేగింపులో మహిళలు

దామరగిద్ద: మండలంలోని కందెన్‌పల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. సోమవారం ప్రాణప్రతిష్ఠ, హోమం, అభిషేకం చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి సొంతూరికి చేరుకున్న ఆడపడుచులు బొడ్రాయికి ప్రత్యేక పూజలు, బోనాలు నిర్వహించారు. మహిళల బొడ్డెమ్మలు, పురుషుల అడుగుల భజనలతో ఆనందంగా ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

విజయం కోసం సమష్టిగా కృషిచేయాలి



దమగ్నాపురంలో మాట్లాడుతున్న సంపత్ కుమార్

చిన్నచింతకుంట: కాంగ్రెస్ విజయం కోసం సమష్టిగా కృషిచేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం దమగ్నాపురంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల ఎన్నికల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. చిన్నచింతకుంటకు సుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, దామోదర్, లాల్‌కోట, బండర్‌పల్లికి నరేందర్‌రెడ్డి, చిన్నవడ్డేమాన్‌కు కథలప్ప, పెద్ద వడ్డెమాన్‌కు మహిమూద్, అల్లిపురంనకు ఎస్ వెంకటేష్, గూడూర్ సురేష్, మద్దూర్‌కు శేఖర్, తండాలకు బలరాం నాయక్, ఏదులాపూరనకు వి.శివకుమార్, ఉంధ్యాలకు సురేందర్‌రెడ్డి, నెల్లికొండికి రాఘవేందర్‌రెడ్డి, అమ్మపురంనకు విజయసారథ్ రెడ్డి, పల్లమర్రికి శ్రీనివాస్‌రెడ్డి, కురుమూర్తికి గంజి బాల్‌రాజు, సీతారాంపేటకు వెంకటేష్ యాదవ్, దమగ్నాపురంనకు టి.వెంకటేష్, పర్దిపురంనకు మొగిలన్నలను ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అరవింద్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

ధన్వాడ: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పంచాయతీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎంపీడీఓ సాయిప్రకాష్ ప్రారంభించారు. వేసవిలో ఎండలు అధికమవడంతో ప్రయాణికులు, ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలస్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్‌కు వినతి అందజేస్తున్న మాల సామాజిక వర్గ ప్రజలు

అమరచింత: పట్టణానికి చెందిన ఓ బీఆర్ఎస్ నాయకుడు తమ సామాజిక వర్గానికి చెందిన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆధారాలతో సోమవారం తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతి అందజేశారు. ఈ మేరకు పట్టణానికి చెందిన మాల సామాజిక వర్గం నాయకులు వెంకట్రాములు, వెంకటస్వామి మాట్లాడారు. 1977లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్ 506 లో మాదిగ సామాజిక వర్గం, మాదిగ సామాజిక వర్గానికి వేర్వేరుగా.. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఇందులో మాలలకు ఒక ఎకరా 10 గుంటలు, 25 కుటుంబాలకు కుటుంబానికి ఐదు సెంట్ల చొప్పున అప్పటి నారాయణపేట ఆర్డీఓ ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. తమకు కేటాయించిన భూమిలో బడి, గుడి కోసం స్థలం కావాలని ఇచ్చిన 5 సెంట్ల భూమిలో ఇంటి నిర్మాణానికి 4 సెంట్ల స్థలాన్ని వినియోగించుకుని మిగిలిన స్థలం ఖాళీగా ఉంచామన్నారు. వీటిపై కన్నేసిన స్థానిక బీఆర్ఎస్ నాయకుడు 2009లో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్రాములు సంతకాన్ని ఫోర్జరీ చేసి బీపీఎల్ కింద తన భార్య పేరుపై 125 గజాల స్థలాన్ని పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో రామస్వామి, శేఖర్, రమేష్, నరేష్, పద్మ, వనజ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లతో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో మంగళవారం జరగనున్న మహనీయుల జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ భారత జాతి నిర్మాణం కోసం అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రాంలు ఎంతో కృషి చేశారని, వారి జయంతిని నిర్వహించుకోవడం గొప్ప విషయం అన్నారు. ముఖ్య అతిథిగా వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, జైపాల్‌రెడ్డి, శ్రీపతిరావు, బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి హుండీ లెక్కింపు



లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది

భూత్పూర్: కందూర్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. కాగా రూ.4,18,110 ఆదాయం వచ్చినట్లు ఈఓ రాజేశ్వర శర్మ తెలిపారు. శివరాత్రి నుంచి ఉగాది పండుగ వరకు జరిగిన బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల నుంచి ఆదాయం సమకూరిందన్నారు.

ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో..

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. కాగా రూ. 2,11,702 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఎండో మెంట్ ఇన్‌స్పెక్టర్ వాసు, సూరిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు నరసింహరెడ్డి, ఆంజనేయులు, నరేష్, వెంకటయ్య, వేణుగోపాల్‌రెడ్డి, రఘు, జవహర్, బీరన్న, మల్లేశ్, వీరన్న, వీరారెడ్డి, శ్రీనివాస్ సాగర్, అర్చకులు నాగరాజుస్వామి, నాగభూషణంస్వామి, సేవా సమితి మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటిసంపులో పడి బాలుడు మృతి



అభినేష్ (ఫైల్)

ధన్వాడ: నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని అప్పజీనగర్ కాలనీలో చోటు చేసుకుంది మండల కేంద్రానికి చెందిన సంద ఆశప్ప కూతురు రాధను పెద్దపొర్లకు చెందిన నర్సింహులుకు వివాహం చేశారు. వీరికి కుమారుడు అభినేష్ (4) ఉన్నాడు. రెండవ కాన్పు కోసం పుట్టింటికి ఆమె వచ్చింది. సోమవారంతో నాలుగు నెలలు పూర్తవగా, ఐదు నెలలు దాటిన తర్వాత అత్తగారింటికి పంపిద్దామని కుటుంబీకులు అనుకుని ఇక్కడే ఉంచుకున్నారు. ఆదివారం రాత్రి కుమారుడు అభినేష్ ఆడుకునేందుకు వెళ్లి ఇంటి పక్కన ఉన్న సంపు గుంతలో పడిపోయాడు. బాలుడు కనిపించకపోవడంతో అంతా వెతికారు. కుటుంబీకులకు సంపులో బాలుడిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందడంతో జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.